సాక్షి కామారెడ్డి


గురువారం । 6 । మార్చి । 2025



అన్నీ సమస్యలే..

తాడ్వాయి మండలంలోని వంకాయపల్లివాసులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

- 8లో ▸





వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉన్నత విద్యాసంస్థలు నెలకొల్పాలి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జుక్కల్ నియోజకవర్గంలో ఉన్నత విద్యాసంస్థలు నెలకొల్పి, ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని కోరారు. బుధవారం ఆయన జుక్కల్ నియోజకవర్గానికి చెందిన సామాజిక కార్యకర్త జ్యోతిర్మయరెడ్డితో కలిసి బాలకిష్టారెడ్డితో సమావేశమయ్యారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఫిషరీష్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ఆగ్రో బేస్డ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేయాలని కోరారు. తమ వినతులపై ఉన్నత విద్యామండలి చైర్మన్ సానుకూలంగా స్పందించారని జ్యోతిర్మయరెడ్డి 'సాక్షి'తో తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలోని అన్ని కోర్టులలో ఈనెల 8 న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సింధు శర్మ బుధవారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. రెండు నెలలకొకసారి నిర్వహించే లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకోదగిన అన్ని రకాల కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్‌లో ఉంటుందని తెలిపారు. ఆయా కేసుల్లో కక్షిదారులుగా ఉన్న వారికి అవగాహన కల్పించి జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

పని చేయని ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్

కామారెడ్డి టౌన్: మున్సిపల్ ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్ రెండు రోజులుగా పని చేయడం లేదు. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందిపడుతున్నారు. 25 శాతం ఫీజు రాయితీతో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఈనెల 31 వరకు అవకాశం ఉంది. ఫీజు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోవాలని ఆధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కొందరు దరఖాస్తుదారులు తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం కామారెడ్డి బల్దియాకు రాగా వెబ్‌సైట్ పని చేయలేదు. దీంతో వారు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై టీపీవో గిరిధర్‌ను వివరణ కోరగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తుండడంతో వైబ్‌సైట్ పని చేయడం లేదన్నారు. రెండు రోజుల్లో సైట్ ఓపెన్ అవుతుందని తెలిపారు. ప్రస్తుతం వెబ్‌సైట్‌తో సంబంధం లేకుండా దరఖాస్తుదారులు 25 శాతం రాయితీతో ఫీజు కట్టాలని, తర్వాత క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు.

రెండు రోజులు ఫ్లెక్సీ దుకాణాల మూసివేత

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని ఫ్లెక్సీ దుకాణాలను ఈనెల 8, 9 తేదీలలో మూసి ఉంచనున్నట్లు కామారెడ్డి ఫ్లెక్సీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రవీణ్, భాను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఫ్లెక్సీ కలర్స్, మెటీరియల్స్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



గాంధారి: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో రాజు సూచించారు. పోతంగల్ కలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి టీచింగ్ లర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. తెలియని విషయాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగాల ద్వారా పాఠాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

టేక్రియాల్ చౌరస్తా వద్ద ఒక్క వరుసతో వేసిన సర్వీస్ రోడ్డు



ఇదేం 'సర్వీస్'!

- జాతీయ రహదారిపై పలుచోట్ల వంతెనల నిర్మాణం
- సర్వీసు రోడ్ల నిర్మాణంలో ప్రమాణాలు గాలికి..
- జిల్లాకేంద్రానికి సమీపంలో సింగిల్ రోడ్లతో సరి
- రాకపోకల సమయంలో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్ల నిర్మాణంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వేరేచోట రెండు వరుసల రోడ్లు నిర్మించిన అధికారులు.. జిల్లాకేంద్రానికి సమీపంలో సింగిల్ రోడ్లను వేయడంపై వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే చోట రెండు వరుసల రోడ్లను వేయాలని కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

జిల్లామీదుగా 44వ నంబరు జాతీయ రహదారి వెళ్తుంది. హైదరాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా నాగ్‌పూర్ వరకు వెళ్లే ఈ హైవే బైపాస్ కూడళ్ల వద్ద గతంలో ప్రమాదాలు జరిగేవి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి నుంచి తెలంగాణ రాష్ట్రం ముగిసి మహారాష్ట్రలోకి ప్రవేశించే బోరజ్ దాకా బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించిన ఎన్‌హెచ్‌ఏఐ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. బోయిన్‌పల్లి నుంచి మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల మీదుగా మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బోరజ్ దాకా 44వ నంబరు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రహదారి అభివృద్ధి పనులు చేపట్టింది. కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి నుంచి కామారెడ్డి పట్టణంలోకి ఎంటర్ అయ్యే నర్సన్నపల్లి చౌరస్తా, పట్టణం నుంచి బయటకు వెళ్లే టేక్రియాల్ చౌరస్తా వద్ద రెండు ఫ్లై ఓవర్లు



పద్మాజీవాడి చౌరస్తా వద్ద వేసిన రెండు వరుసల సర్వీస్ రోడ్డు

నిర్మించింది. అలాగే సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడీ చౌరస్తా వద్ద కూడా ఫ్లైఓవర్ నిర్మించింది. అయితే రెండు చోట్ల వంతెనల వద్ద సర్వీస్ రోడ్లను ఒక్క వరుసతోనే నిర్మించారు. దీంతో హైదరాబాద్, నాగ్‌పూర్‌ల నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వచ్చేవారు, అలాగే కామారెడ్డి నుంచి ఇటు హైదరాబాద్‌కు, అటు నాగ్‌పూర్ వైపునకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే పద్మాజీవాడి చౌరస్తా వద్ద రెండు వరుసల రోడ్డు నిర్మించడం గమనార్హం.

సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు

జాతీయ రహదారిపై టేక్రియాల్, నర్సన్నపల్లి బైపాస్‌ల వద్ద వంతెనలను నిర్మించి, పట్టణానికి వచ్చేందుకు సర్వీస్ రోడ్లను ఇరుకుగా నిర్మించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్డుపై ఏదైనా వాహనం ఆగిపోతే రోడ్డు బ్లాక్ అవుతోంది. ఇటీవల పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ వైపు నుంచి, అలాగే నిజామాబాద్, ఆర్మూర్, నాగ్‌పూర్ వైపు నుంచి కామారెడ్డి పట్టణానికి నిత్యం వందలాది బస్సులు, వందలాది కార్లు, ఇతర వాహనాలు వచ్చిపోతుంటాయి. నిరంతరం రద్దీగా ఉంటుంది. వాహనాల రద్దీ నేపథ్యంలో డబుల్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సింగిల్ రోడ్డుతోనే సరిపెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. నర్సన్నపల్లి, టేక్రియాల్ జంక్షన్ల వద్ద వంతెనకు రెండు వైపులా రెండు వరుసల రోడ్లు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు కరువు

కొత్తగా నిర్మించిన వంతెనల వద్ద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. కొత్త వంతెనల మీదుగా వాహనాలు వెళ్తున్నాయి. అయితే హైదరాబాద్ నుంచి కామారెడ్డి పట్టణానికి వచ్చే వాహనదారులు నర్సన్నపల్లి వంతెన వద్ద ఎలాంటి బోర్డులు లేవు. అలాగే టేక్రియాల్ వద్ద కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు కొంతదూరం ముందుకు వెళ్లిపోయి తిరిగి వెనక్కి వస్తున్నారు. పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద కూడా వంతెనపై నుంచి వాహనాల రాకపోకలు ప్రారంభమైనప్పటికీ సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో గాంధారి, బాన్సువాడ వైపు వెళ్లాల్సిన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'మోడల్' నిర్మాణాలు పూర్తి చేయాలి

- మేస్త్రీలకు శిక్షణ ఇప్పించండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలన్నారు. ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున ఇళ్ల నిర్మాణాలు చేపట్టే మేస్త్రీలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇసుక, సిమెంట్, ఇతర ముడిసరుకులను సమకూర్చాలన్నారు. ఇటుక తయారీ కోసం స్వయం సహాయక సంఘాలను గుర్తించి యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. నిరుపేదలకు ప్రాధాన్యత కల్పిస్తూ నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న వారికి అనుమతించాలన్నారు. కొత్త మండలాల్లో మోడల్ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, జెడ్పీ సీఈవో చందర్, డీఆర్‌డీవో సురేందర్, గృహనిర్మాణ శాఖ ఈఈ విజయపాల్ రెడ్డి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: సదరం శిబిరాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరికరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సదరం క్యాంపుల నిర్వహణకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగం, జిల్లా ఆస్పత్రి కోఆర్డినేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' అందేదెప్పుడో?

- కొందరి ఖాతాల్లోనే నిధులు జమ
- వేలాది మంది రైతులకు తప్పని నిరీక్షణ



బాన్సువాడ : ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం కొందరికే అందింది. ఇప్పటివరకు మూడెకరాల్లోపు రైతులకు మాత్రమే నగదు జమ అయ్యింది. బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో 34,526 మంది రైతులు రైతు భరోసాకు అర్హత కలిగి ఉన్నారు. అయితే ఇప్పటివరకు 24,688 మంది రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ అయ్యాయి. మూడెకరాలలోపు భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందించామని సర్కారు చెబుతోంది. అయితే తమకు మూడెకరాలలోపు భూమి ఉన్నా రైతు భరోసా డబ్బులు రాలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. డబ్బులు జమ అయ్యాయో లేదో తెలుసుకోవడానికి నిత్యం బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కాగా కొందరు రైతులు సేవింగ్ ఖాతాలకు బదులు పంట రుణం ఖాతా నంబరు ఇచ్చారని, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ పేర్లలో తప్పిదాలు, ఇటీవల భూములు కొనుగోలు చేసిన కొత్త రైతులకు డబ్బులు కాలేదని అధికారులు సమాధానమిస్తున్నారు. కాగా మూడు మండలాల పరిధిలో మూడెకరాలపైన భూమి ఉన్న రైతులు సుమారు పది వేల మంది వరకు ఉన్నారు. వారంతా రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారు. త్వరగా పెట్టుబడి సాయం అందించాలని కోరుతున్నారు.

రేపు మాపు అంటున్నరు

నాకు మూడెకరాల భూమి ఉంది. ఇప్పటికే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా ఇవ్వలేదు. యాసంగి కూడా చివరికి వస్తోంది. ఇప్పటికీ పెట్టుబడి సాయం అందించలేదు. అధికారులను అడిగితే రేపు మాపు అంటున్నారు. ఆలస్యం చేయకుండా తొందరగా నిధులు విడుదల చేసి, రైతులను ఆదుకోవాలి.

– సాయిలు, రైతు, బాన్సువాడ

పెట్టుబడి సాయం అందలేదు

నాకు ఎకరంనర వ్యవసాయ భూమి ఉంది. రెండో, మూడో విడతలో కూడా రైతు భరోసా రాలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే బ్యాంకు ఖాతా తప్పుగా ఉన్నట్లు ఉందని చెబుతున్నారు. బ్యాంకు వాళ్లను అడిగితే వ్యవసాయ అధికారులనే అడగమంటున్నారు. రైతు భరోసా అందుతుందో లేదోనని ఆందోళనగా ఉంది.

– విఠల్, రైతు, బాన్సువాడ

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్



జిల్లాకేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రం సమీపంలో తెరిచి ఉన్న జిరాక్స్ సెంటర్

- 96.02 శాతం విద్యార్థులు హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద సందడి

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జిల్లావ్యాప్తంగా 38 సెంటర్‌లలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 96.02 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 9,230 మంది విద్యార్థులకుగాను 8,863 మంది పరీక్ష రాశారు. మొదటి రోజు కావడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది. దాదాపు విద్యార్థులందరూ పరీక్ష సమయం లోపు కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీఆర్యభట్ట జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అశిష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా, మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పరీక్ష కేంద్రాలలోనికి పంపించే సమయంలో ప్రతి విద్యార్థిని పరిశీలించాలన్నారు. అనధికార వ్యక్తులను లోనికి పంపించరాదన్నారు. కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి పలు కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కాగా నిబంధనల ప్రకారం పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాల్సి ఉంటుంది. కానీ జిల్లా కేంద్రంలో ఈ నిబంధన అమలు కాలేదు. పరీక్ష నిర్వహిస్తున్న సమయంలోనూ పలుచోట్ల జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉన్నాయి.



జిల్లా కేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పట్టభద్రుల సీటూ కమలానిదే

- అధిక ఓట్లతో గెలిచిన బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి
- మూడురోజులు సాగిన ఎమ్మెల్సీ కౌంటింగ్
- ముగ్గురికే 92.52 శాతం ఓట్లు



విజయ సంకేతాన్ని చూపుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీ విజేత అంజిరెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. మూడు రోజుల పాటు ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో ఎలిమినేషన్ రౌండ్స్‌తో బీజేపీ అభ్యర్థి గెలుపు ఖరారైంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత కూడా గెలుపునకు సరిపడా కోటా ఓట్లు రాకపోయినా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి అత్యధిక ఓట్లు రావడంతో ఆయననే విజేతగా ప్రకటించారు. చివరి వరకు హోరాహోరీగా పోరాడిన కాంగ్రెస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయాయి.

సుదీర్ఘంగా సాగిన కౌంటింగ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక గతనెల 27న జరగ్గా, ఈనెల 3న కౌంటింగ్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్విరామంగా మూడు షిఫ్ట్‌ల్లో 800 మంది కౌంటింగ్ సిబ్బంది కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో 21 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. సోమవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించిన అధికారులు, మంగళవారం మధ్యాహ్నం వరకు చెల్లని ఓట్లును వడపోసి, కట్టలు కట్టారు. అదేరోజు రాత్రి నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించడం ప్రారంభించి బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి ఎలిమినేషన్ రౌండ్స్‌ను ప్రారంభించారు. ఎలిమినేషన్ రౌండ్స్‌లో బరిలో ఉన్న 56 మందిలో తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఒక్కొక్కరిగా తొలగిస్తూ, వారి బ్యాలెట్ పేపర్‌లోని ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను మిగిలిన అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ ప్రక్రియను మూడు రోజులపాటు సుదీర్ఘంగా కొనసాగించారు.

త్రిముఖ పోటీలో..

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 56 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. చెల్లుబాటు అయిన ఓట్లలో 92.52 శాతం (2,06,659) మొదటి ప్రాధాన్యత ఓట్లు ఈ ముగ్గురికే వచ్చాయి. మిగిలిన 53 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు 16,684 ఓట్లు మాత్రమే సాధించారు.

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ బీజేపీదే హవా

నిర్ధారిత కోటా ఓట్ల కోసం అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టగా అందులో సైతం బీజేపీ అభ్యర్థి ఆధిక్యం చూపారు. తొలుత 53 మందిని ఎలిమినేషన్ చేసి రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించగా బీజేపీ అభ్యర్థికి 78,635 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 73,644 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థికి 63,404 ఓట్లు వచ్చాయి. 53 మందిని ఎలిమినేషన్ చేసినా.. కోటా ఓట్లను ఎవరూ సాధించకపోవడంతో మూడోస్థానంలోని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను ఎలిమినేట్ చేశారు. అతడికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరకు బీఎస్పీ అభ్యర్థికి పోలైన ఓట్లలో చాలామంది రెండో ప్రాధాన్యత ఓటును బీజేపీకే వేయడంతో కమలం పార్టీకే విజయం దక్కింది.



కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన్న అభ్యర్థులు అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

అహిల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


మాట్లాడుతున్న బాశెట్టి లత

కామారెడ్డి అర్బన్: కఠిన ఆచారాలున్న సమయంలో మహిళల అభ్యున్నతి, జనోద్ధరణకు పూనుకున్న గొప్ప మహారాణి అహిల్యాబాయి హోల్కర్ అని, ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ బాశెట్టి లత అన్నారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అధ్యతన 'ది ఫిలాసఫియర్ క్వీన్' అహిల్యాబాయి హోల్కర్ 300 జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించగా అసోసియేట్ ప్రొఫెసర్ లత ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, తెలుగు, హిందీ విభాగం అధ్యక్షులు పి.విశ్వప్రసాద్, జి.శ్రీనివాస్‌రావులు అనంతరం ప్రసంగించారు. అధ్యాపకులు రవికుమార్, మల్లేశం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి


అవగాహన కల్పిస్తున్న రమణ

మాచారెడ్డి: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలంటే కొన్ని నిబంధనలు పాటించాలని జిల్లా మానసిక వైద్యాధికారి జి.రమణ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్షల సమయంలో ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని సూచించారు. కఠినమైన సబ్జెక్టులను ముందుగా ప్రణాళిక వేసుకొని అర్థం కాని వాటిని ఉపాధ్యాయులనడిగి సందేహాలు నివత్తి చేసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు సరైన మోతాదులో ఆహారం. సరైన నిద్ర మానసిక ప్రశాంతత అత్యవసరమన్నారు. యోగా, వ్యాయామం లాంటివి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల మానసిక సమస్యలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ అందించారు. జిల్లా సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి మైశకళ, ఎంఎల్ హెచ్పీ శ్రీకాంత్, ఉపాధ్యాయినులు గీత, సంధ్యారాణి, కళావతి, గంగ, మమత, ఆశా వర్కర్ ఇందిర ఉన్నారు.

వంకాయపల్లిలో అన్నీ సమస్యలే

- నరిగ్గా సరఫరా కాని తాగునీరు
- రోడ్లు, డ్రైనేజీలు కరువు
- గ్రామానికి పోవడానికి బండ్ల బాటే దిక్కు
- అగ్గిపెట్టె అవసరం ఉన్నా రెండు కిలోమీటర్ల దూరం నడవాల్సిందే
- పట్టించుకోని అధికార యంత్రాంగం


తాగునీటి ట్యాంకర్ కోసం వేచి చూస్తున్న వంకాయపల్లి గ్రామస్తులు

తాడ్వాయి: అది ఒక మారుమూల గ్రామం. ఎలాంటి వసతులు లేని ఊరు. ఆ ఊరికి ఎవరూ పోరు. ఈ కాలంలో అలాంటి ఊరుందా అని అందరూ ఆశ్చర్య పోవాల్సిందే. ఆ గ్రామం ఎక్కడో కాదు. కామారెడ్డి జిల్లాకు 20 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. వివరాలు.. తాడ్వాయి మండలంలోని చిట్యాల జీపీ పరిధిలోని వంకాయపల్లి గ్రామంలో అన్నీ సమస్యలే ఉన్నాయి. ఆ గ్రామంలో నీళ్లట్యాంకు ఉన్నా నాలుగైదు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా అవుతుంది. ఆ నీళ్లకూడా ఒక్కొక్క ఇంటికి రెండు నుంచి నాలుగు బిందెలు నీళ్ల మాత్రమే వస్తాయి. ఈ విషయమై వాటరు మెన్‌కు చెప్పినా పెడచెవిన పెడుతున్నాడు. మీకు నీళ్లను అంతే ఇస్తాం అని బెదిరిస్తున్నాడు. గ్రామంలో బోరుబావులు, ఓపెన్ బావులు లేక మిషన్ భగీరథ ద్వారా మాత్రమే నీరు సరఫరా అవుతుంది. గ్రామంలో రెండు హ్యాండ్ బోర్లు ఉన్నా ఒకటి 8 సంవత్సరాల క్రితం పూర్తిగా చెడిపోయింది. ఇంకొక బోరు నుంచి నీళ్లు సరిగ్గా రావు. గ్రామంలో డ్రైనేజీలు లేక మురికి నీరు రోడ్లపై పారుతుంది. వర్షాకాలంలో మాత్రం గుట్టపై నుంచి వచ్చే వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతున్నాయి.

ప్రతి పనికి చిట్యాల లేదా తాడ్వాయికి..

ప్రతి ఒక్క పనికి చిట్యాల, తాడ్వాయి మండల కేంద్రానికి వెళ్లవలసి ఉంటుంది. చిట్యాల నుంచి రోడ్డు లేక వ్యవసాయ పొలంలోకి వెళ్లే బండ్ల బాట వెంబడి కాలినడక వెళ్లాల్సి వస్తుంది. గ్రామ పంచాయతీ చిట్యాల అయితే రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న రాజంపేట మండలంలోని ఆర్గొండకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఆర్గొండకు పోవాలంటే అధిక డబ్బులు వెచ్చించి ఆటోలలో వెళుతున్నారు. అగ్గిపెట్టె అవసరం ఉన్నా ఆర్గొండకు వెళ్లవలసి వస్తుంది. రేషన్ బియ్యం, పింఛన్‌లు కోసం ఆర్గొండకు వెళ్లి తీసుకుంటున్నారు. మండల కేంద్రానికి రావాలంటే వయా ఆర్గొండ మీదుగా సంతాయిపేట్, చిట్యాల మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో అదనంగా 10 కిలోమీటర్ల దూరమే కాకుండా అధిక డబ్బులను వెచ్చించవలసి వస్తుంది. అదే వంకాయపల్లి నుంచి చిట్యాలవరకు ఉన్న రోడ్డును తారు రోడ్డుగా మార్చిట్లయితే దూరం తగ్గుతుంది. కరెంటు స్తంభాలు ఉన్నాయి. కాని ఎర్తు కనెక్షన్ లేక ఒక్కొక్కసారి షాక్ తగులుతుందో మోనని గ్రామస్తులు భయపడుతున్నారు.

2006, 2008లలో ఊరంతా ఖాళీ..

సమస్యల కారణంగా 2006లో ఒకసారి, 2008లో ఒకసారి ఊరు ఖాళీ చేసి కామారెడ్డి, ఆర్గొండ, మెదక్ ప్రాంతాలకు వలస వెళ్లారు. దీంతో అప్పట్లో గ్రామానికి అధికారులు వచ్చి అన్ని వసతులను కల్పి స్తామని చెప్పారు. అయినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పుడు కూడా అధికారులు పట్టించుకోకపోతే ఈ గ్రామం విడిచి వలస వెళతామని బాధతో చెబుతున్నారు. ఈ గ్రామాన్ని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్గొండ గ్రామ పంచాయతీ పరిధిలోకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మాత్రం మారుత లేవని ఆవేదన చెందుతున్నారు. చాలా కుటుంబాలు సమస్యలు భరించలేక ఇతర గ్రామాలకు వెళ్లిపోయాయి. దీంతో వారి ఇళ్లు శిథిలమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వలస పోవడంతో కూలిపోయిన ఇల్లు


చిట్యాల నుంచి వంకాయపల్లికి పోయే బండ్లబాట

ఒక్క ఇంటికి మీటరు లేదు..

గ్రామంలో ప్రస్తుతం 20 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఏ ఒక్కింటికి మీటరు కనెక్షన్ లేదు. చిట్యాల గ్రామ పంచాయతీ వారు ఆ ఇళ్లకు నంబరు కేటాయించరు. గ్రామపంచాయతీ ధ్రువీకరణ లేనిది ట్రాన్స్‌కో అధికారులు మీటర్లు ఇవ్వరు. వీరిబాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. అంతేకాకుండా గత నాలుగు సంవత్సరాల నుంచి ఉపాధిహామీ పనులు జరుగడంలేదు. దీంతో 25 మంది కూలీలకు ఉపాధి దక్కడం లేదు. ఇప్పటికీ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా కట్టించలేదు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి పాఠశాల లేవు. రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆర్గొండకు కాలినడకన వెళ్లి చదువుకుంటున్నారు.

ఆర్గొండ పరిధిలోకి మార్చాలి

మా గ్రామాన్ని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్గొండ గ్రామ పంచాయతీ పరిధిలోకి మార్చాలి. ప్రతి పనికి , ప్రతి వస్తువుకు, ఇతర గ్రామానికి వెళ్లాలన్నా ఆర్గొండకు వెళ్తాం. చిట్యాల గ్రామం వెళ్లాలంటే దూరా భారమవుతుంది. –రాజయ్య, గ్రామస్తుడు

ఇంటి నంబర్లను కేటాయించండి

గ్రామంలో ఉన్న ఇండ్లకు ఇంటి నంబర్లను కేటాయించాలి. ఇంటి నంబర్ల ఉంటే కరెంటు మీటర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీంతో కరెంటు సమస్యలు తీరుతాయి. మురికి నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతున్నాయి. అలాగే డ్రైనేజీలు నిర్మించాలి. –లావణ్య,గ్రామస్తురాలు

ప్రతిపాదనలు పంపించాం

వంకాయపల్లి గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. తాగునీటి సమస్యలు మాత్రం పరిష్కారం అయ్యేలా చూస్తాం. –సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీడీవో, తాడ్వాయి

బయోటెక్నాలజీతో బహుముఖ ప్రయోజనాలు


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): బయోటెక్నాలజీ పరిశోధనలతో వివిధ రంగాల్లో బహుముఖ ప్రయోజనాలు కలుగుతాయని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో నూతన వంగడాల సృష్టి, పారిశ్రామిక రంగంలో అధిక ఉత్పత్తి, వైద్య రంగంలో వ్యాధుల నివారణకు ఈ శాస్త్రం కృషి చేస్తోందన్నారు. తెయూ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం బయోటెక్నాలజికల్ ప్రయోగాల ప్రదర్శనపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో వీసీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొవిడ్ మహమ్మారిలాంటి ప్రాణాంతక వైరస్‌ను అరికట్టేందుకు భారత్ బయోటెక్నాలజీ సంస్థ వ్యాక్సిన్ తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడిందని గుర్తుచేశారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధితో మనదేశం వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు పోతుందన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఏర్పాటు చేసుకునేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదం చేస్తాయని తెలిపారు.

నిందితుడి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): తండ్రిపై దాడికి పాల్పడి మృతి కారణమైన కొడుకును రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై వెంకట్రావు తెలిపారు. శెట్పల్లి గ్రామానికి చెందిన వల్లకాటి చంద్రశేఖర్ గత నెల 18న ఆస్తి కోసం తండ్రి లింగంపై దాడి చేసిన విషయం తెలిసిందే. తండ్రి లింగం చికిత్స పొందుతూ మృతి చెందగా, కొడుకును అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

'హిందువులు స్వధర్మానికి కట్టుబడి ఉండాలి'


విశ్వశాంతి మహాయజ్ఞంలో పాల్గొన్న పీఠాధిపతులు

కామారెడ్డి అర్బన్: హిందువులందరూ తమ స్వధర్మానికి కట్టుబడి ఉండాలని వివిధ ఆశ్రమ పీఠాధిపతులు అన్నారు. పట్టణ పరిధిలోని టేక్రియాల్ శ్రీక్రిష్ణానంద ఆశ్రమ ఐదవ వార్షికోత్సవం, శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానంద స్వామి 79వ జన్మదినం సందర్భంగా బుధవారం సాధుసమ్మేళనం, విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహించారు. కృష్ణానందస్వామిని ఘనంగా సన్మానించారు. సాధుపరిషత్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వరానందస్వామి, విశ్వాత్మానందగిరిస్వామి(భద్రాచలం), బ్రహ్మానందస్వాములు(కరీంనగర్), మాతపరేశ్వరానందగిరి(ఆర్మూర్), బాలన్నస్వామి(అమృతాపూర్), క్రిష్ణానందగిరి(కొత్తపల్లి), సనకసనంద స్వామి, నిర్మలానందగిరి(దూస్‌గాం), సహజానందస్వామి(దీక్షానగర్), రామకృష్ణానందగిరిస్వామి(ఐలాపూర్)లు పాల్గొని మాట్లాడారు. సామూహిక గీతా పారాయణం చేశారు. చాత్తాదశ్రీవైష్ణవ సంఘం, టేక్రియాల్ భజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విధులకు అధికారులు డుమ్మా..!

- సెలవు పెట్టకుండా బయటికి వెళ్లిన అధికారులు

బీబీపేట: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అధికారులే విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రజలు తమ తమ పనుల కోసం కార్యాలయానికి వస్తే ఖాళీ కుర్చీలు దర్శనమిస్తూ అటెండరే సమాధానాలు చెప్పి వెనక్కి పంపిన తీరు బుధవారం బీబీపేట మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకుంది. వివరాలు.. కామారెడ్డి జిల్లా బీబీపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి హైదరాబాద్‌లో సమావేశానికి హాజరయ్యారు. దీంతో బాధ్యతలను ఎంపీవో అబ్బాగౌడ్ చూసుకోవాల్సి ఉంది. కానీ ఉదయం విధులకు హాజరైన ఎంపీవో అబ్బాగౌడ్, టీఏ వినయ్, ఉపాధి హామీ కంప్యూటర్ ఆపరేటర్ ఆంజనేయులు, జూనియర్ అసిస్టెంట్లు ఇద్దరు, కంప్యూటర్ ఆపరేటర్లు నాగరాజు, రాజు, కొంత మంది పంచాయతీ కార్యాదర్శులు కొంత సేపటికే బయటికి వెళ్లిపోయారు. సాయంత్రం వరకు రాలేదు. కార్యాలయంలో ఒక మహిళా జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు మాత్రమే ఉన్నారు. ఎవరు వచ్చినా ఏ వివరాలూ ఇవ్వకూడదని చెప్పి బయటికి వెళ్లినట్లు తెలిసింది. కాగా బుధవారం కలెక్టర్ అశిష్ సంగ్వాన్ జనగామ, బీబీపేటలను సందర్శించాల్సి ఉండగా.. ఆ పర్యటన రద్దయ్యింది. దీంతో ఇదే అదునుగా భావించిన సిబ్బంది విధులకు డుమ్మా కొట్టినట్లు తెలుస్తోంది.


బీబీపేట పంచాయతీ కార్యాలయంలో ఖాళీగా దర్శనం ఇస్తున్న కుర్చీలు

గల్ఫ్ ఏజెంట్ మోసం

బోధన్‌రూరల్: గల్ఫ్ ఏజెంట్ మోసం చేయడంతో బోధన్ మండలం పెగడాపల్లికి చెందిన ఓ యువకుడు షార్జాలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పెగడపల్లి గ్రామానికి చెందిన గుండారం ప్రభాకర్, భాగ్య దంపతులకు ఇద్దరు కొడుకులు. వీరి పెద్ద కొడుకు గుండారం చంద్రశేఖర్‌కు దుబాయి లేదా షార్జాలో క్లీనింగ్ పని ఇప్పిస్తానని నిజామాబాద్‌కు చెందిన కృష్ణ అనే ఏజెంట్ 8 నెలల క్రితం రూ.90 వేల వరకు తీసుకున్నాడు. తీరా దుబాయికి వెళ్లగా అక్కడ ఏజెంట్ చెప్పినట్లుగా ఉపాధి లభించలేదు. చంద్రశేఖర్‌ను అక్కడి నుంచి షార్జాకు తీసుకెళ్లారు. అక్కడ కూడా సరైన ఉపాధి చూపించలేదు. దీంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న చంద్రశేఖర్ రోజువారీ ఖర్చుల కోసం కుటుంబసభ్యులే పలుమార్లు డబ్బులు పంపించారు. ఈ విషయమై ఏజెంట్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ప్రస్తుతం తమ కొడుకు ఇబ్బందులు పడుతున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. మోసం చేసిన ఏజెంట్ కృష్ణపై చర్యలు తీసుకుని తమ కొడుకును స్వగ్రామాని రప్పించాలని బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై ఎస్సై మచ్చేందర్ రెడ్డిను సంప్రదించగా బాధితులు సమస్యను తమ దృష్టికు తెచ్చారని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాచారెడ్డి: అక్రమంగా తరలిస్తున్న 250 కిలోల పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని కొత్తపల్లి బస్టాండ్ వద్ద బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. భవానీపేట తండాకు చెందిన మాలోత్ రాజు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై 250 కిలోల పీడీఎస్ బియ్యాన్ని మాచారెడ్డిలో తక్కువ ధరకు కొని అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో బుధవారం జరిగిన వివిధ ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. కామారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ, నిజామాబాద్ జిల్లాలో వేర్వేరు చోట్ల వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఫిట్స్‌తో యువకుడు, బురదగుంటలో పడి మరో వ్యక్తి మరణించారు.

పింఛన్ కోసం వెళ్లి వస్తుండగా..


అంజవ్వ(ఫైల్)

కామారెడ్డి రూరల్: పింఛన్ కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న ఓ మహిళ కారు ఢీకొని మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూమన్నగారి అంజవ్వ(55) తనకు వచ్చే వితంతు పింఛన్ కోసం పక్కనే ఉన్న సరంపల్లి గ్రామానికి వెళ్లింది. పింఛన్ తీసుకొని సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ తిరిగి చిన్నమల్లారెడ్డికి వస్తుండగా గ్రామ శివారులో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అంజవ్వ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో యువకుడు..


రాకేశ్(ఫైల్)

ఇందల్వాయి: పశుగ్రాసం కోసం వెళ్లిన యువకుడు ఫిట్స్ వచ్చి పొలంలోనే పడి మృతి చెందిన ఘటన సిర్నాపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొబ్బాజి రాకేశ్(23) ఉదయం తన స్నేహితులతో కలిసి పొలానికి వెళ్లాడు. గడ్డికోసే క్రమంలో ఫిట్స్ రావడంతో పొలంలో పడి ఊపిరాడక మృతి చెందాడు. ఆలస్యంగా గమనించిన స్నేహితులు కుటుంబీకులకు సమాచారం అందించారు. గతంలో పెద్ద కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణించగా, ప్రస్తుతం రెండో కొడుకు రాకేశ్ ఫిట్స్‌తో మృతి చెందడంతో తల్లిదండ్రులు కొబ్బాజి గంగారం కళావతి శోకసంద్రంలో మునిగారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

హార్వెస్టర్ ఢీకొని వ్యక్తి ..

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం అన్నారం శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జీజీ నడ్కుడకు చెందిన బాద్గుణ చిన్నారెడ్డి (45) ద్విచక్ర వాహనంపై డొంకేశ్వర్ నుంచి సొంతూరికి వెళ్తుండగా అన్నారం శివారులో ఎదురుగా వస్తున్న హార్వెస్టర్ ఢీకొట్టింది. హార్వెస్టర్ కిందకు వెళ్లడంతో చిన్నారెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


శ్రీనివాస్(ఫైల్)

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ – జానకంపేట్ రోడ్డులో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఠాణాకలాన్ గ్రామానికి చెందిన మెట్టు శ్రీనివాస్ (33) జానకంపేట్ నుంచి ఠాణాకలాన్ వైపు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఓ మొరం టిప్పర్ శ్రీనివాస్‌ను ఢీకొట్టినట్లు పలువురు అనుమానిస్తున్నారు. మృతుడు జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.

చేపల కోసం వెళ్లి వ్యక్తి ..

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన బొర్ర చిన్న సాయిలు (45) చేపల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామ శివారులోని గూండ్ల వాగు వద్దకు వెళ్లిన సాయిలు.. చేపల కోసం వల వేసి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బురదగుంటలో పడిపోయాడు. రాత్రంతా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా బురదగుంటలో సాయిలు మృతదేహం కనిపించింది. బుధవారం ఉదయం భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన సాదుల్ల సుశీల (55) మృతదేహం బుధవారం ధర్మోరా గ్రామం వద్ద గుత్ప ఎత్తిపోతల కాలువలో లభ్యమైంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. సాదుల్ల సుశీల కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె భర్త సాయన్న గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందాడు. సుశీలకు అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులుండడంతో జీవితంపై విరక్తితో ఈ నెల 2న ఇంట్లో చెప్పకుండా వెళ్లి నందిపేట వద్ద కాలువలో దూకినట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాలువలో కొట్టుకువచ్చి ధర్మోరా వద్ద తేలిందన్నారు. మృతురాలి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్ (25) ఆటో నడిపిస్తూ జీవనం సాగించేవాడు. అప్పుల కారణంగా కొద్దిరోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన నాగేశ్ బయటకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్

ఆర్మూర్‌టౌన్: అర్ధరాత్రి తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆలూర్ మండలం దేగాం, మిర్దాపల్లి గ్రామాల్లోని పలు ఇళ్లలో ఇటీవల చోరీలు జరిగాయి. కేసు దర్యాప్తులో భాగంగా ఆర్మూర్ పాత బస్టాండ్ వద్ద మంగళవారం ఉదయం ప్రధాన నిందితుడైన అలకుంట శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. నిందితుని నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

ఖలీల్‌వాడి: తాగిన మత్తులో కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాసిన్ ఆరాఫత్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని గాజులపేట్‌లో మంగళవారం బోడిగం సంతోష్ అనే వ్యక్తి తాగిన మత్తులో తన బంధువైన లింగంపల్లి మహేశ్‌పై దాడి చేశాడు. బాధితుడి భార్య లింగంపల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 15 రోజుల జ్యుడీషియల్ కస్టడికి పంపినట్లు ఎస్సై తెలిపారు.

కేసు విత్‌డ్రా చేసుకున్న మాజీ ఎమ్మెల్యే

ఖలీల్‌వాడి: ఎన్నికల ప్రచారంలో తన వాహన అద్దాలు పగులగొట్టిన ఇద్దరిపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాజిరెడ్డి గోవర్ధన్ 2014 ఏప్రిల్ 23న నిజామాబాద్ రూరల్ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎలమ్మకుంటకు వెళ్లారు. ప్రచారం చేయకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన కేతావత్ మోహన్, కేతావత్ యాదగిరి తదితరులు అడ్డుకొని కారు అద్దాలు పగులగొట్టారని బాజిరెడ్డి గోవర్ధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విత్‌డ్రా కోసం మోహన్, యాదగిరిలు మాజీ ఎమ్మెల్యేను అభ్యర్థించగా బుధవారం నిజామాబాద్ నాల్గో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్(జూనియర్ సివిల్ జడ్జి) వడ్డి హరికుమార్ ఎదుట లోక్ అదాలత్‌కు హాజరయ్యారు.

ఈ నెల 8న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో కేసును కొట్టివేయాలని కోరగా, ముద్దాయిలపై కేసును కొట్టివేస్తూ జడ్జి హరికుమార్ అవార్డును జారీ చేశారు. న్యాయవాదులు అల్గోట్ రవీందర్, ఆశ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

- ఒకరికి గాయాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామశివారులో బుధవారం రోడ్డుపై మర్రిచెట్టు కూలడంతో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మెంగారం గ్రామానికి చెందిన అన్నం సాయిలు మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు భారీ మర్రిచెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో సాయిలుకు గాయాలుకాగా, వాహనం ధ్వంసమైంది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని లింగంపేట ఆస్పత్రికి తరలించారు. మర్రి కొమ్మ రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఆర్ అండ్‌బీ అధికారులు కొమ్మలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.